సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 1 | ఫిబ్రవరి | 2023



మినీ జాతరకు వేళాయె

కోరిన కోర్కెలు తీర్చే సమ్మక్క-సారలమ్మ మినీ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు.

- 8లో



నల్లబెల్లం పట్టివేత - 8లో

50 క్వింటాళ్ల నల్లబెల్లం, 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని డీసీఎం వాహనాన్ని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

గరిష్టం/కనిష్టం
32.0°/16.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

‘ఓపెన్’ ఫీజు చెల్లించాలి

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్ పొందిన, గతంలో ఫెయిల్ అయిన టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈఓ అబ్దుల్ హై, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం.శంకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. మీసేవ లేదా టీఎస్ ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించవచ్చని, టెన్త్ విద్యార్థులు సబ్జెక్టుకు రూ.100, ఇంటర్‌లో సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. రూ.25 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 11 నుంచి 16 వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఫిబ్రవరి 17 నుంచి 22 వరకు చెల్లించాలని కోరారు. పూర్తి వివరాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ శంకర్‌రావును సంప్రదించాలని పేర్కొన్నారు.

11న జాతీయ లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.రాధాదేవి



వరంగల్ లీగల్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో కోర్టులోని జిల్లా న్యాయసేవా సదన్ భవనంలో ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ కె.రాధాదేవి తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పెండింగ్, రాజీపడదగిన కేసుల పరిష్కారానికి ఇది చక్కని అవకాశమన్నారు. లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి ఇన్సూరెన్స్, సంబంధిత న్యాయవాదులు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు సహకరించాలని సూచించారు. కక్షిదారులు న్యాయ సలహాలు, సూచనల కోసం న్యాయసేవాధికార సంస్థలను ఆశ్రయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.ఉపేందర్‌రావు, ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్ టి.రవీందర్‌రావు, సీహెచ్.లింగమూర్తి, కె.లక్ష్మారెడ్డి, బి.రమేష్‌గౌడ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ శ్రీనివాస్‌గౌడ్, లీగల్ ఎయిడ్ న్యాయవాదులు పాల్గొన్నారు.

‘పవర్ ఎంప్లాయీస్’ కార్యవర్గం



హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ రూరల్ డివిజన్ నూతన కమిటీని ఎనుకున్నట్లు ఆ యూనియన్ ఎన్పీడీసీఎల్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.శశికుమార్, హనుమకొండ జిల్లా కార్యదర్శి పి.వేమనరెడ్డి తెలిపారు. మంగళవారం హనుమకొండ అడ్వకేట్స్ కాలనీలో రూరల్ డివిజన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.మహేష్, సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జె.పుల్లాజి, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా పి.శ్రీనివాస్, జి.రామచొక్కం, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా పి.సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఎస్.సాంబయ్య, కె.మల్లయ్య, కె.మదన్‌మోహన్, జి.రాజేష్, కె.రమేష్‌బాబు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జి.సంపత్‌కుమార్, అదనపు కార్యదర్శిగా బి.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా కున్న రమేష్, ఎం.రాజశేఖరం, ఎం.రమేష్, యు.తిరుపతి, జి.మహబూబ్, పోతరాల రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అయిత రాము, కోశాధికారిగా సీహెచ్.సంజీవ ఎన్నికయ్యారు. అనంతరం ఎన్పీడీసీఎల్ హనుమకొండ రూరల్ డీఈ బి.సామ్యానాయక్‌కు నూతన కమిటీని పరిచయం చేశారు.

జిల్లాస్థాయి స్టోరీ టెల్లింగ్ పోటీలు



కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్‌లో మంగళవారం ఎల్టా ఆధ్వర్యంలో విద్యార్థులకు జిల్లాస్థాయి స్టోరీ టెల్లింగ్ అండ్ స్పెల్ విజార్డ్ పోటీలు నిర్వహించారు. పోటీలను రిజిస్ట్రార్ గోవర్ధన్‌రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు ఇంగ్లిష్ భాష తోడ్పడుతుందన్నారు. కాగా.. రెండు జిల్లాల నుంచి 109 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈనెల 13న హైదరాబాద్‌లో టీఎస్ఎస్సీఆర్టీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నిట్ హ్యూమానిటీస్ హెడ్ మాధవీరెడ్డి, ఎల్టా వ్యవస్థాపక అధ్యక్షుడు కొమురయ్య, సంపత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి..

- ఎంజేపీ విద్యార్థులతో మంత్రి కేటీఆర్ చిట్‌చాట్
- కమలాపూర్‌లో రూ.49కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం
- హెలికాప్టర్‌లో కమలాపూర్‌కు.. రోడ్డు మార్గంలో జమ్మికుంటకు కేటీఆర్
- వెంట మంత్రులు ఎర్రబెల్లి, గంగుల, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, వరంగల్/కమలాపూర్: ‘ఏం చేస్తున్నారు.. ఎలా చదువుతున్నారు.. చదివి ఏం కావాలనుకుంటున్నారు.. ఉద్యోగాలు చేయాలి.. కొలువులు ఇచ్చే స్థాయికి ఎదగాలి.. అందుకు చాలా మార్గాలున్నాయి.. అవకాశాలు కూడా ఉన్నాయి.. ఉన్నత స్థాయికి ఎదగాలంటే కష్టపడి చదివే తత్వం ఉండాలి’ అంటూ విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకుంటూ, తన అనుభవాలను మంత్రి కేటీఆర్ వారితో పంచుకున్నారు. హనుమకొండ జిల్లా కమలాపూర్, గూడూరులో మంగళవారం పర్యటించిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పురపాలక శాఖల మంత్రి కేటీఆర్ ఎక్కువ సమయం మహాత్మా జ్యోతిబాపూలే(ఎంజేపీ) గురుకుల పాఠశాల విద్యార్థులతో గడిపారు. శాస్త్ర సాంకేతిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థులు ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. డ్రోన్ చూడటానికి చిన్నగా కనిపించినా.. దాంతో చాలా ఉపయోగాలు ఉంటాయని వివరించారు. డ్రోన్ల తయారీ కంపెనీలు ఏర్పాటు చేసినా చాలా మందికి మీరు ఉద్యోగావకాశాలు కల్పించవచ్చన్నారు. ఉన్నత, సాంకేతిక విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు హైదరాబాద్‌లోని ఐటీ హబ్‌లు, ‘టాస్క్’ సెంటర్ల ద్వారా అవగాహన కల్పిస్తామని మంత్రి కేటీఆర్ విద్యార్థులకు తెలియజేశారు. ఈ మేరకు అక్కడే ఉన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ, ఎంజేపీ ప్రిన్సిపాల్ ప్రపుల్లతో మాట్లాడిన కేటీఆర్.. బస్సులు మాట్లాడి విద్యార్థులను పంపించాలని ఆదేశించారు.

కమలాపూర్‌లో మూడున్నర గంటలు

మంగళవారం ఉదయం 11.57 గంటలకు కరీంనగర్ నుంచి హెలికాప్టర్ ద్వారా కమలాపూర్ మండలం గూడూరుకు చేరుకున్న మంత్రి కేటీఆర్ మూడున్నర గంటలపాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు ప్రజాప్రతినిధులు, అధికారులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఓపెన్ టాప్ వాహనంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ తదితరులతో కలిసి ర్యాలీగా బయలుదేరి కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం కమలాపూర్‌లో నిర్మించిన కుల సంఘాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. అక్కడి నుంచి ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు చేరుకుని రూ.49కోట్ల విలువ చేసే ఎంజేపీ బాలికలు, బాలుర గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభించారు.

నాన్‌వెజ్ మానేశా..

గూడూరు ఎంజేపీ గురుకుల పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల సహపంక్తిలో రుచికరమైన భోజనం ఏర్పాటు చేశారు. అయితే విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కేటీఆర్.. తాను నాన్‌వెజ్ మానేశానని, అందుకే పప్పు, చారు, పెరుగుతో ముగిస్తానంటూ పక్కన కూర్చున్న పిల్లలకు కూరలు వడ్డించారు. అనంతరం మధ్యాహ్నం 3.27 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు వెళ్లారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, వొడితల సతీష్‌కుమార్, తాటికొండ రాజయ్య, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, టీఎస్ఈడబ్ల్యూడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, హనుమకొండ, కరీంనగర్ జిల్లాల జెడ్పీ చైర్మన్లు డాక్టర్ మారెపెల్లి సుధీర్‌కుమార్, కనుమల్ల విజయ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి మల్లయ్య బట్టు, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ జాలి నరేందర్‌రెడ్డి, తక్కళ్లపెల్లి సత్యనారాయణరావు, కళ్లెపు మోహన్‌రావు, ఎంపీపీ తడక రాణి, జెడ్పీటీసీ లాండిగె కల్యాణి, వైస్ ఎంపీపీ మౌటం శైలజ, సర్పంచులు కట్కూరి విజయ, అంకతి సాంబయ్య, ఎంపీటీసీలు మెండు రాధిక, మాట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్



గ్రామ పంచాయతీ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

సమావేశంలో మాట్లాడుతున్న సుధారాణి



సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించండి

- రోజూ తాగునీరు సరఫరా చేయాల్సిందే..
- సమీక్షలో మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: వేసవి కాలం సమీపిస్తున్న దృష్ట్యా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని నగర మేయర్ గుండు సుధారాణి ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో గ్రేటర్, ప్రజారోగ్యం ఇంజనీర్లతో నీటి సరఫరా, లీకేజీలపై సర్కిళ్లవారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రిజర్వాయర్లలో నీరు ఆశాజనకంగా ఉందన్నారు. ఫిల్టర్ బెడ్ల పనులు, కొత్త పైపులైన్ల మార్పు, ఇంటర్ కనెక్షన్, లీకేజీలు అరికట్టడం, ఇతర నీటి సరఫరా సంబంధిత పనులు మార్చి చివరి నాటికి పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ నుంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలన్నారు. పోతన నగర్, ఓ సిటీ పైపులైన్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నగరవ్యాప్తంగా బల్దియా ద్వారా జరిగే నీటి సరఫరాలో 2021 అక్టోబర్ నుంచి 5,952 లీకేజీలు గుర్తించి.. 5,376 అరికట్టామని, మిగిలిన వాటిని తక్షణమే అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పబ్లిక్ హెల్త్ విభాగంలో 570 లీకేజీలు ఉండగా.. వాటిలో 525 అరికట్టామని, పెండింగ్‌లో ఉన్న లీకేజీలు వెంటనే సరిచేయాలని సూచించారు. సమీక్షలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈ శ్రీనివాసరావు, పబ్లిక్ హెల్త్, బల్దియా డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, రవికిరణ్, సారంగం, రవీందర్, ఏఈలు పాల్గొన్నారు.

హనుమకొండ కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్

నిజామాబాద్ కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ బదిలీ



సాక్షిప్రతినిధి, వరంగల్: హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన కలెక్టర్ల బదిలీల్లో భాగంగా హనుమకొండ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాజీవ్‌గాంధీ హన్మంతును నిజామాబాద్‌కు బదిలీ చేశారు. ఆదిలాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సిక్తా పట్నానాయక్‌ను హనుమకొండకు బదిలీ చేశారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సిక్తా పట్నానాయక్ 1987లో జన్మించారు. 2014లో ఐఏఎస్ సర్వీసులోకి వచ్చిన ఆమె 2019-20లో పెద్దపల్లి కలెక్టర్‌గా పనిచేశారు. 2020, జూన్ 17న పెద్దపల్లి నుంచి ఆదిలాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. సుమారు 2 సంవత్సరాల ఏడు నెలలపాటు ఆదిలాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆదిలాబాద్ నుంచి హనుమకొండ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. 2020, ఫిబ్రవరి 4న వరంగల్ అర్బన్(హనుమకొండ) కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ హన్మంతు సుమారు మూడేళ్లపాటు పనిచేశారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసి హనుమకొండకు వచ్చిన ఆయన 2012 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు కాగా, గతంలో రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లాలో ట్రెయినీ కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ఇదిలా ఉండగా.. 2020, జూన్ 17న ఆదిలాబాద్ కలెక్టర్‌గా బదిలీ అయిన సిక్తా పట్నాయక్ ముచ్చటగా మూడోసారి మహిళా కలెక్టర్ జిల్లా పాలనా పగ్గాలు చేతబట్టారు. ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసి పాఠశాల విద్యా శాఖ సంచాలకురాలిగా బదిలీపై వెళ్తున్న ఎ.శ్రీదేవసేన నుంచి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సిక్తా పట్నాయక్ రెండేళ్ల ఏడు నెలలపాటు పనిచేశారు. రెండు రోజుల్లో ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని అధికార వర్గాల సమాచారం. కాగా.. సిక్తా పట్నాయక్‌కు భర్త, కుమారుడు సారంగ్ ఉన్నారు.

జీవితకాల అనుభవం..



- జిల్లాలో మూడేళ్లు సంతృప్తినిచ్చింది..
- వరదల నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాం..
- ‘సాక్షి’తో బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

హన్మకొండ అర్బన్: ‘జిల్లాలో పనిచేసిన మూడేళ్ల కాలం ఎంతో సంతృప్తినిచ్చింది. కరోనా కష్టకాలం, వరదలు, ఎన్నికలు, వీవీఐపీల తాకిడి వంటి అంశాలు జీవితకాల అనుభవాలుగా గుర్తుండిపోతాయి’ అని హనుమకొండ కలెక్టర్‌గా పనిచేసి బదిలీపై నిజామాబాద్ వెళ్తున్న రాజీవ్‌గాంధీ హన్మంతు చెప్పుకొచ్చారు. ఫిబ్రవరి 3వ తేదీ నాటికి మూడేళ్ల కాలం పూర్తవుతుందని, ఇక్కడ కలెక్టర్‌గానే కాదు.. ఉమ్మడి జిల్లాలో శిక్షణ కలెక్టర్‌గా పనిచేశానని ఆయన గుర్తు చేశారు. అనుభవాలు ఆయన మాటల్లోనే...

కరోనా కాలం మరచిపోలేం..

అవును.. మరో మూడు రోజులైతే జిల్లాకు వచ్చి మూడేళ్లు పూర్తవుతుంది. ఈ సమయంలో ప్రపంచాన్ని వణికించిన కరోనా రెండు వేవ్‌లు మనం చూశాం. అప్పుడు వరంగల్ అర్బన్ జిల్లా పరిధిలో ఎంజీఎం ఎండేది. ఆ సమయంలో ప్రాణాలు లెక్క చేయకుండా ప్రజల మధ్యలో ఉండాల్సి వచ్చింది. ఎంత జాగ్రత్తగా ఉన్నా నాకు కూడా కరోనా సోకింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం లాక్‌డౌన్, కర్ఫ్యూ, కంటైన్‌మెంట్ జోన్లు ఇలా.. ప్రజలు వైరస్ బారిన పడకుండా చూసేందుకు అన్ని చర్యలు తీసుకుని ముందుకు సాగాం.

ప్రతిష్టాత్మకంగా గ్రేటర్ ఎన్నికలు

గ్రేటర్ వరంగల్ ఎన్నికల నిర్వహణ సవాల్‌గా తీసుకున్నాం. రాష్ట్రం మొత్తం చూపు గ్రేటర్ ఎన్నికలవైపే అన్నట్లు పరిస్థితులు ఉన్నా యంత్రాంగం ఆ ప్రక్రియను సమర్థంగా పూర్తి చేసింది.

వరదల సమస్యకు శాశ్వత పరిష్కారం

జిల్లాలో 2020, 2021 వరుసగా రెండేళ్లు విపరీత వర్షాలు, వరదలొచ్చాయి. అంతకుముందు 30, 40 ఏళ్లలో ఉన్నదూ లేని విధంగా భారీ వర్షాలు రావడంతో నగరం అతలాకుతలమైంది. ఆ సమయంలో ప్రాణనష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాం. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా సమగ్ర ప్రణాళిక రూపొందించాం.

వంగరలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

భీమదేవరపల్లి మండలం వంగరకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ రావడం.. దానికి ప్రభుత్వపరంగా 180 ఎకరాల స్థలం సేకరించడం జరిగింది. జిల్లాకు వచ్చిన ప్రాజెక్టుల్లో ఇది పెద్దదిగా చెప్పొచ్చు. దీంతోపాటు పీరియాడికల్ ఓవరాయిలింగ్ షెడ్‌కు సంబంధించి స్థలం అప్పగించడం వంటి పనులు పూర్తి కావడం సంతోషకరం.

అతిథులకు ఆతిథ్యం

జిల్లాకు ముఖ్యమంత్రి సుమారు ఐదారుసార్లు వివిధ కార్యక్రమాలపై వచ్చారు. కోర్టు భవనం ప్రారంభోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి వచ్చారు. వజ్రోత్సవ కార్యక్రమాలకు భారత ఉపరాష్ట్రపతి హాజరయ్యారు. ఇలా.. వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండేది. జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా సహకరించారు.

నత్తనడకన ‘మన బడి’

- జిల్లాలోని 176 పాఠశాలలకు.. ఐదింట్లో పనులు పూర్తి
- నేడు ప్రాక్టీసింగ్ స్కూల్‌ను ప్రారంభించనున్న చీఫ్ విప్ వినయ్‌భాస్కర్
- ఫర్నిచర్ రాగానే మరికొన్ని..
- ఎమ్మెల్యేలతో ప్రారంభించాలని సీఎస్ ఆదేశం

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన మన ఊరు-మన బడి పథకం పనులు జిల్లాలో నత్తనడకన సాగుతున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాల్సి ఉండగా.. ఆ దిశగా ముందుకు సాగడం లేదు. మండలానికి రెండు పాఠశాలల చొప్పున అంటే.. 28 పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన విషయం విదితమే. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ జిల్లాలోనూ మన ఊరు-మన బడి పథకం కింద పనులు పూర్తయిన పాఠశాలలను ప్రారంభించాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కలెక్టర్లను ఆదేశించినట్లు సమాచారం.

మోడల్‌గా ప్రారంభించాలని...

జిల్లాలో మన ఊరు-మన బడి కింద మోడల్‌గా కనీసం 12 పాఠశాలలను ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు సిద్ధం చేస్తున్నారు. వీటిలో పనులు పూర్తయి పెయింటింగ్ వేసిన పాఠశాలలు 5 ఉన్నాయి. హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల(ఇంగ్లిష్ మీడియం), లష్కర్ బజార్ ప్రాథమిక పాఠశాల, హసన్‌పర్తి మండలం దేవన్నపేట, వంగపహాడ్ ఎంపీపీఎస్‌లు, కాజీపేట మండలం మడికొండ ఎంపీపీఎస్‌లో పెయింటింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో ఆయా పాఠశాలలు కొత్త శోభను సంతరించుకున్నాయి. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలతో అభివృద్ధి చేసిన పాఠశాలలను ప్రారంభించాలని కలెక్టర్లను ఆదేశించారు. కాగా.. పనులు పూర్తయినప్పటికీ పాఠశాలలకు ఇంకా ఫర్నిచర్ రాలేదని, రాగానే ప్రారంభిస్తామని డీఈఓ అబ్దుల్ హై తెలిపారు.

పెయింటింగ్ దశలో...

ధర్మసాగర్ మండలం కాశగూడెం, తాటికాయల ఎంపీపీఎస్, హనుమకొండ మార్కజీ ప్రాథమిక పాఠశాల, వడ్డెపల్లి ప్రాథమిక పాఠశాల, పరకాలలోని వెలమవాడ ఎంపీపీఎస్, వేలేరులోని ఎర్రబెల్లి ఎంపీపీఎస్, కాజీపేటలోని సోమిడి ప్రాథమిక పాఠశాలల్లో పనులు పెయింటింగ్ దశలో ఉన్నాయి.

తొలిదశలో 176 పాఠశాలలు ఎంపిక

జిల్లాలో 492 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. తొలిదశలో మన ఊరు-మన బడి కింద 176 పాఠశాలలను ఎంపిక చేశారు. వాటిలో 12 రకాల పనులను రూ.30లక్షలలోపు వ్యయంతో చేపట్టాలని నిర్ణయించిన విషయం విదితమే. 133 పాఠశాలల్లో పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయి. మిగి తా కొన్ని హైస్కూళ్లలో రూ.30లక్షలకుపైగా ఉండే పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆ తర్వాత కొన్ని హైస్కూళ్లకు టెండర్లు దాఖలు చేశారు. జిల్లాకు రూ.62.01కోట్లు కే టాయించగా.. ఇప్పటివరకు రూ.5లక్షలలోపు బి ల్లులు ఎస్ఎంసీలకు అందినట్లు సమాచారం. పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, డైనింగ్ హాళ్ల పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. విద్యుత్, మైనర్, మేజర్ రిపేర్లు, ఫ్లోరింగ్, ప్రహరీ, మరుగుదొడ్లు తదితర చిన్నచిన్న పనులు చేపట్టారు. ఫర్నిచర్ డెస్క్‌లు, చాక్‌బోర్డులను ప్రభుత్వమే నేరుగా పంపనుంది.



కొత్త శోభను సంతరించుకున్న హనుమకొండ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాల

నేడు ప్రాక్టీసింగ్ పాఠశాల ప్రారంభం

అభివృద్ధి పనులు పూర్తయిన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ పాఠశాలను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ బుధవారం ప్రారంభించనున్నారు. మంగళవారం ఉదయం అదనపు కలెక్టర్ సీహెచ్.సంధ్యారాణి, సాయంత్రం డీఈఓ అబ్దుల్ హై ఆ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. స్కూల్ హెచ్ఎం ఉప్పలయ్యతో మాట్లాడారు. పాఠశాలకు డ్యూయల్ డెస్క్‌లు, గ్రీన్ చాక్ బోర్డులు, సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా సరఫరా చేస్తారని డీఈఓ తెలిపారు. ప్రారంభోత్సవంలో చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ తోపాటు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పాల్గొంటారని పేర్కొన్నారు.



పెయింటింగ్ పనులు పూర్తయిన మడికొండ ఎంపీపీఎస్

పార్కు పనుల్లో వేగం పెంచండి



పార్కు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: ప్రాక్టీసింగ్ స్కూల్‌లో ఏర్పాటు చేస్తున్న సైన్స్ పార్క్ పనుల్లో వేగం పెంచాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం నర్చరింగ్ నైబర్‌హుడ్ చాలెంజ్‌లో భాగంగా హనుమకొండలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కొరకు ఏర్పాటు చేస్తున్న సైన్స్ పార్కులో కొనసాగుతున్న పనులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట బల్దియా స్మార్ట్ సిటీ పీఎంఈ ఓలేటి ఆనంద్, సీహెచ్‌ఓ శ్రీనివాస్‌రావు, డీఈ సంతోష్‌బాబు, ఏఈలు తదితరులు ఉన్నారు.

వెబ్‌సైట్‌లో పదోన్నతుల జాబితా

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు సంబంధించి ఎస్‌జీటీల సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ ఎండి.అబ్దుల్ హై మంగళవారం తెలిపారు. జిల్లాలో 44 మంది పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులకు అవకాశం ఉంది. అయితే ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా, పీఎస్‌హెచ్‌ఎంలుగా పదోన్నతులకు అవకాశం ఉందని, వేర్వేరుగా స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందేందుకు వివిధ సబ్జెక్టులకు సంబంధించిన సీనియారిటీ జాబితాలను కూడా అందుబాటులో ఉంచారు. పీఎస్‌హెచ్‌ఎంల పదోన్నతుల కోసం ఎస్‌జీటీల సీనియారిటీ జాబితాలో 249 మందికి అవకాశం కల్పించారు. ఇప్పటికే రెండుసార్లు పదోన్నతికి అవకాశం వచ్చినా తిరస్కరించిన టీచర్లకు ఇప్పుడు అవకాశం కల్పించడం లేదని డీఈఓ తెలిపారు. వరంగల్ జిల్లాలో ఇప్పటికే అన్ని కేడర్ల సీనియారిటీ జాబితాలను సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. రెండు డీఈఓ కార్యాలయాల్లోనూ అభ్యంతరాలు స్వీకరిస్తున్నారు.

రెండు జిల్లాల అబ్జర్వర్‌గా విజయలక్ష్మీబాయి

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో టీచర్ల బదిలీలు, పదోన్నతులు ప్రక్రియ సజావుగా జరిగేలా పరిశీలనకు అబ్జర్వర్‌గా రాష్ట్ర అడల్ట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ విజయలక్ష్మీబాయిని నియమించారు. ఈ మేరకు మంగళవారం ఆమె హనుమకొండ, వరంగల్ డీఈఓ కార్యాలయాలను సందర్శించారు. వరంగల్ డీఈఓ వాసంతితో విజయలక్ష్మీబాయి మాట్లాడారు. పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీచర్ల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియపై సీనియారిటీ జాబితాలు, వేకెన్సీలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే హనుమకొండ డీఈఓ కార్యాలయంలో జిల్లాలోని కేడర్ స్ట్రెంత్, వేకెన్సీలు, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ రిజర్వేషన్ల కోటా అమలుపై ఆరా తీశారని సమాచారం. ఈ సందర్భంగా అధికారులకు ఆమె పలు సూచనలు చేశారు.



బదిలీల వివరాలు తెలుసుకుంటున్న అబ్జర్వర్

క్లుప్తంగా

రూ.రెండు కోట్లతో వ్యాపారి పరార్..?

మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో వివిధ వ్యాపారాలు చేసే వ్యక్తి సుమారు రూ.రెండు కోట్ల అప్పు తీసుకుని పరారీ అయినట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. సదరు వ్యక్తి మహదేవపూర్, పలివెల మండలాల్లో కాంట్రాక్టర్‌గా పనిచేయడంతో పాటు గుట్కా వ్యాపారం కూడా చేసేవాడని తెలిసింది. వివిధ గ్రామాల ప్రజలకు బ్యాంకు లోన్లు ఇప్పించేవాడని, ఐదు రోజులుగా కనిపించకుండా పోయేసరికి చర్చ జరుగుతోంది. కాగా, సదరు వ్యక్తి దాదాపు రూ.రెండు కోట్ల అప్పు తీసుకున్నట్లు తెలిసింది. అప్పు తిరిగి చెల్లించలేక కుటుంబంతో సహా వెళ్లిపోయినట్లు సమాచారం.

కేయూ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌గా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావును నియమిస్తూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసారు. సోమవారం జరిగిన కేయూ పాలకమండలి సమావేశంలో శ్రీనివాస్‌రావును రిజిస్ట్రార్‌గా నియమిస్తూ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. మంగళవారం ఆయన ఉద్యోగ విరమణ పొందగా పాలక మండలి నిర్ణయం మేరకు సంవత్సరం రిజిస్ట్రార్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

భార్యాభర్తలపై కేసు

నల్లబెల్లి: వరి పొలంలోకి అక్రమంగా ప్రవేశించి పంట నష్టం చేసిన భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం మంగళవారం తెలిపారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం గుండ్లపహాడ్ గ్రామానికి చెందిన కూస ఆదిరెడ్డికి గాంధీనగర్ శివారులో ఎకరం భూమి ఉండగా వరి సాగు చేశాడు. వ్యక్తిగత కక్షలతో కూస రాంచంద్రు, మంజుల దంపతులు పొలంలోకి అక్రమంగా ప్రవేశించి గొర్రె సాయంతో సుమారు 15 గుంటల వరిని ధ్వంసం చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

దొంగతనం కేసులో 16 నెలల జైలు

గణపురం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహా బంగారం షాపులో చోరీకి పాల్పడిన వ్యక్తికి భూపాలపల్లి జడ్జి రామచంద్రరావు 16 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. 2021, సెప్టెంబర్‌లో నేపాల్ దేశానికి చెందిన సాగర్ రావత్ మండల కేంద్రంలోని బంగారం షాపులో చోరీకి పాల్పడి పారిపోయాడు. దుకాణం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చిట్యాల సీఐ పులి వెంకట్‌గౌడ్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. భూపాలపల్లి కోర్టులో హాజరుపరచగా నిందితుడికి 16 నెలల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

మినీ జాతరకు వేళాయె..

నేడు మేడారంలో మండమెలిగె పండుగ

- నాలుగు రోజులపాటు జాతర నిర్వహణ
- పూజా కార్యక్రమాలకు సిద్ధం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- భక్తులతో కళకళలాడనున్న మేడారం



సమ్మక్క గద్దెను పూలతో అలంకరిస్తున్న దృశ్యం

ఎస్ఎస్‌తాడ్వాయి: కోరిన కోర్కెలు తీర్చే సమ్మక్క–సారలమ్మ మినీ జాతర బుధవారం(నేటి) నుంచి ప్రారంభం కానుంది. ఆదివాసీ సంస్కృతీసంప్రదాయం, ఆచారాలకు అనుగుణంగా సమ్మక్క–సారలమ్మ పూజారులు నేడు మండమెలిగె పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు మేడారంలోని సమ్మక్క ఆలయం, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో మండమెలిగె పండుగ నిర్వహించేందుకు పూజారులు సిద్ధమయ్యారు. సమ్మక్క–సారలమ్మ ఆలయాలను శుద్ధి చేశాక సమ్మక్క పూజారి సిద్దబోయిన మునీందర్ ఇంట్లో నుంచి పూజ సామగ్రిని సమ్మక్క గుడికి తీసుకెళ్తారు. గుడిలో పవిత్రమైన పుట్టమట్టితో అలుకు పూత నిర్వహిస్తారు. ఆడపడుచులు ఆలయం లోపల, బయట ముగ్గులతో అలంకరిస్తారు. అనంతరం గ్రామ దేవతలకు, మైసమ్మకు పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత మేడారం ప్రధాన ద్వారం వద్ద అమ్మవార్ల గద్దెల ప్రవేశ మార్గం ఎదుట దొరస్తంభాలు(దిష్టి తగలకుండా ఏర్పాటు చేసే ద్వార స్తంభం) లేపుతారు. ద్వారానికి మామిడి ఆకులు, తోరణానికి సొరకాయ, కోడిపిల్లను కడతారు. మేడారంలోని మరో ప్రవేశం మార్గం దారిలో దొరస్తంభాలను ఏర్పాటు చేస్తారు. అనంతరం సమ్మక్క గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బుధవారం రాత్రి సమ్మక్క గుడి నుంచి పూజారులు అమ్మవారి రూపంలో పసుపు, కుంకుమ, పూజ సామగ్రిని తీసుకుని తల్లుల గద్దెల వద్దకు డోలివాయిద్యాలతో వెళ్తారు. గద్దెల వద్ద సమ్మక్క–సారలమ్మ పూజారులు కలుసుకుని రాత్రంతా గద్దెల వద్ద జాగారం చేస్తారు. కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలోనూ పూజారులు మండమెలిగె పండుగ పూజలు నిర్వహిస్తారు. ఆ తర్వాత శనివారం(ఫిబ్రవరి 4) వరకు మినీ జాతర జరగనుంది.

ఊరంతా కళకళ

మండమెలిగె పండుగతో ఊరంతా కళకళలాడనుంది. పండుగ సందర్భంగా ఇంటి ఆడపడుచులను, చుట్టాలను ఇళ్లకు ఆహ్వానించడం ఆదివాసీల అనవాయితీ. ప్రస్తుతం మేడారంలో ఏ ఇళ్లు చూసినా చుట్టాలతో కళకళలాడుతోంది. మండమెలిగె పండుగ ముగిసిన తర్వాత ఇంటికి వచ్చిన ఆడపడుచులను, బంధువులను తిరిగి ఇంటికి సాగనంపెట్టప్పుడు కొత్త బట్టలు, అమ్మవారి ప్రసాదం(బెల్లం) ఇచ్చి సాగనంపుతారు. మండమెలిగె పండుగ ఉత్సవాల సందర్భంగా మేడారంలోని నాలుగు రోజులు పండుగ వాతావరణం నెలకొననుంది.



ఎండోమెంట్ ఆవరణలో పోలీసుల చెక్‌పోస్ట్



అమ్మవార్ల సన్నిధిలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ

గద్దెలు ముస్తాబు

బుధవారం నుంచి మినీ జాతర ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో సమ్మక్క–సారలమ్మల గద్దెల ప్రాంగణాన్ని వరంగల్‌కు చెందిన ఓ దాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బంతి పూలతో అలంకరించారు. గద్దెల ప్రాంగణంతో పాటు సమ్మక్క ముఖద్వారానికి పూలదండలు, మామిడి తోరణాలు కట్టారు. దీంతో జాతర కల సంతరించుకుంది. మంగళవారం సాయంత్రం నుంచే పోలీసులు వారికి కేటాయించిన ప్రదేశాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట దారిలో, హరిత హోటల్ వై జంక్షన్‌తోపాటు పలు ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఎండోమెంట్ ఆవరణలో పోలీసుల అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత ఆ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. జంపన్నవాగు వద్ద ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఐమాస్ట్ లైట్లను పరిశీలించారు. ఈఓ రాజేంద్రం మాట్లాడుతూ జాతరకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ సదానందం మంగళవారం అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ సంప్రదాయం ప్రకారం పూజారుల గద్దెల పైకి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవార్ల కండువా కప్పి సన్మానించారు. తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు, దేవాదయ శాఖ సిబ్బంది ఉన్నారు.

ఆచారం ప్రకారమే



అనాదిగా వస్తున్న ఆదివాసీల సంస్కృతీసంప్రదాయం, ఆచారం ప్రకారం మండమెలిగె పండుగ నిర్వహిస్తున్నాం. నాలుగు రోజుల పాటు జరిగే మినీ జాతర విజయంతానికి జిల్లా అధికారులు సహకరించాలి. జాతరలో భక్తులకు ఎలాంటి ఆసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలి. మండమెలిగె పండుగకు బంధువులను ఇళ్లకు ఆహ్వానిస్తాం. మండమెలిగె పండుగ పూజా కార్యక్రమాల నిర్వహణకు అన్నీ సిద్ధం చేశాం.

– సిద్దబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

కారు దగ్ధం

- ఆయుర్వేద వైద్య కళాశాలలో ఘటన



దగ్ధమవుతున్న కారు

కాశిబుగ్గ: వరంగల్ లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఎదుట పార్క్ చేసిన కారులో నుంచి మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. విద్యార్థులు ధైర్యం చేసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేక కారు పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ రావు వివరాల ప్రకారం.. వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ బేసిక్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డా.అలేఖ్య కారులో మంగళవారం మధ్యాహ్నం కళాశాలకు చేరుకుంది. కాసేపటికే కారులోనుంచి పొగలు రావడం మొదటి అంతా వ్యాపించాయి. విద్యార్థులు, స్థానికులు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా, షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఉంటాయని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. విషయం తెలుసుకున్న మిల్స్ కాలనీ సీఐ శ్రీనివాస్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఫైర్ సిబ్బంది రవీందర్, వెంకటేష్, రాజేందర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

ఏటూరునాగారం: జీవితంపై విరక్తి చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొలిపాక వెంకటనర్సయ్య–సుగుణ దంపతుల కుమారుడు రాజు(25) 10 ఎకరాల్లో వరి సాగు చేశాడు. పంటకు మొగిపురుగు సోకడంతో దిగుబడి రాదేమోనని మనస్తాపం చెందాడు. దీనికితోడు రాజు చిన్నతనంలో రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి సర్జరీ అయింది. అంగవైకల్యం ఉండడంతో వివాహం కావడం లేదని, పెళ్లి చూపులకు వచ్చి తిరిగిపోతున్నారని తరచూ బాధపడేవాడు. ఈ క్రమంలో ఇటు పంట దిగుబడి రాదేమోనని, అటు వివాహం జరగడం లేదని జీవితంపై విరక్తి చెందిన రాజు తాను సాగు చేస్తున్న పొలం వద్ద సోమవారం పురుగు మందు తాగి పడిపోయాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు ఏటూరునాగారం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు.. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెకండ్ ఎస్సై ఇంద్రయ్య తెలిపారు.

20 క్వింటాళ్ల పత్తి దగ్ధం



కాలిపోయిన పత్తిని చూపుతున్న రైతు దంపతులు

కురవి: షార్ట్‌సర్క్యూట్‌తో 20 క్వింటాళ్ల పత్తి దగ్ధమైన సంఘటన మహబూబాబాద్ జిల్లా కురవి మండలం అయ్యగారిపల్లిలో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రైతు పొన్నెబోయిన మధుసూదన్ పత్తి పంటను ఏరి ఇంట్లోని ఓ గదిలో నిల్వచేశాడు. ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగడంతో పత్తి దగ్ధమైంది. మంటను అదుపు చేసేందుకు ప్రయత్నించిన ఫలితం లేక పోవడంతో పత్తి పూర్తిగా కాలిపోయింది.

తల్లిని చంపిన కేసులో రిమాండ్

దంతాలపల్లి: మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామంలో తల్లిని చంపిన కేసులో కొడుకు, కోడలును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కూచిపూడి జగదీష్ తెలిపారు. గ్రామానికి చెందిన డోనికన రాములమ్మ(75)ను హత్య చేశారని ఆమె చిన్నకొడుకు, కుమార్తెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణ జరిపి రాములమ్మ పెద్ద కొడుకు డోనికన నారాయణ, అతడి భార్య పద్మను నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పోక్సో కేసులో రెండున్నర ఏళ్ల జైలు

జనగామ రూరల్: పోక్సో కేసులో వ్యక్తికి రెండున్నర ఏళ్ల జైలు, రూ.25 వేలు జరిమానా విధిస్తూ జనగామ జిల్లా జడ్జి కె.శైలజ తీర్పు చెప్పారు. జనగామలోని ధర్మకంచలో నివాసం ఉంటున్న దొడ్డి ప్రశాంత్ 2020, డిసెంబర్ 30న ఇంటి పక్క నివాసం ఉంటే 8 ఏళ్ల బాలికపై అత్యాచారయత్నం చేయబోయాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం కోర్టు కానిస్టేబుల్ తిరుపతి సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ స్టీవెన్స్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో జడ్జి శైలజ ప్రశాంత్‌కు రెండున్నర ఏళ్ల, రూ.25 వేల జరిమానా విధించారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వాలి

హన్మకొండ: ఆటో డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీకి ప్రత్యేక శిబిరం నిర్వహించాలని తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆడెపు వెంకటేశ్వర్లు కోరారు. హనుమకొండలోని ఏకశిల పార్కులో యూనియన్ ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక లైసెన్స్ జారీ శిబిరం నిర్వహించి డ్రైవింగ్ లైసెన్స్‌లు లేని ఆటో డ్రైవర్లకు లైసెన్స్‌లు ఇప్పించాలని, ఆ దిశగా వరంగల్ పోలీసు కమిషనర్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ చొరవ తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ ఆటో డ్రైవర్లకు దళిత, గిరిజన బంధు పథకాన్ని వర్తింపజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు సూరి, ఇమ్మడిశెట్టి రాజు, సార మహేందర్, బరిగల కృష్ణమూర్తి, గోపనబోయిన రాజు, హింగె శ్రీకాంత్, మస్కే కరుణాకర్, ఆవుల నవీన్‌కుమార్, పెసరు శివశంకర్, ఎండీ.సజ్జు, కొట్టె జోసఫ్, రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



వినయ్‌రెడ్డి (ఫైల్)

వరంగల్ క్రైం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చాపలబండ గ్రామానికి చెందిన తోకల శ్రీనివాస్‌రెడ్డి కుమారుడు వినయ్‌రెడ్డి (20) హనుమకొండలోని ఓ షోరూంలో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి విధులు ముగించుకుని ఇంటికి వస్తుండగా నయీంనగర్ వద్ద అతడి బైక్ డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన వినయ్‌రెడ్డిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ ఎడెల్లి రజితఉమేష్‌రెడ్డి, ఎంపీటీసీ పిండి కుమారస్వామి, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, జర్నలిస్టులు పరామర్శించారు.

టిప్పర్ ఢీకొని పది గొర్రెలు..

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం జీడివాగు సమీపంలో మణుగూరు నుంచి వరంగల్ వైపు వెళ్తున్న టిప్పర్ గొర్రె మందను ఢీకొట్టడంతో పది గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. బాధితుడు మనుమోదుల సత్యం తెలిపిన వివరాల ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన సత్యం తన గొర్రె మందను మంగళవారం అడవిలో మేతకు తీసుకెళ్తున్నాడు. జీడివాగు సమీపంలో గొర్రె మంద రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టింది. దీంతో 10 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని బాధితుడు బోరున విలపించారు. టిప్పర్ డ్రైవర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని తెలిపాడు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ అరుణ దీహెచ్‌రావు, తాళ్ల వంశీ





హోరాహోరీగా ఎస్‌పీఎల్

- క్వార్టర్ ఫైనల్‌కు చేరిన జట్లు



గెలుపొందిన ఆర్ట్స్ అండ్ సైన్స్ జట్టు

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నాలుగు రోజులుగా హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మంగళవారం నాటి మ్యాచ్‌లను తాళ్లపద్మావతి కళాశాల డైరెక్టర్ వంశీ హాజరై ప్రారంభించగా ఆరు జట్లు మూడు మ్యాచ్‌ల్లో తలపడ్డాయి. ఈ టోర్నీలో మొత్తం 24 జట్లు పాల్గొంటుండగా 12 జట్లు ఎలిమినేట్ అయి మిగతా జట్లు క్వార్టర్ ఫైనల్ చేరాయి. మంగళవారం జరిగిన మొదటి మ్యాచ్‌లో ఆదర్శ కళాశాల, మాస్టర్ జీ డిగ్రీ అండ్ పీజీ కళాశాల జట్లు తలపడ్డాయి. మాస్టర్ జీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో మొదట బ్యాటింగ్ చేసిన ఆదర్శ కళాశాల జట్టు 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 68 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మాస్టర్ జీ కళాశాల జట్టు 5 ఓవర్లలో 71 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో త్రిశూల్ 17 బంతుల్లో 42 పరుగులు సాధించి మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

- రెండో మ్యాచ్‌లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, న్యూసైన్స్ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి టాస్ గెలిసిన ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన న్యూసైన్స్ జట్టు 10 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆర్ట్స్ కళాశాల జట్టు 6.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 60 పరుగులు సాధించి విజయకేతనం ఎగరవేసింది. 24 పరుగులు చేసిన మహేష్ మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు..
- మూడో మ్యాచ్‌లో తాళ్ల పద్మావతి, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి తాళ్ల పద్మావతి జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 10 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 94 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన వాగ్దేవి కళాశాల జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు 88 పరుగులు మాత్రమే చేసింది. ఆరు పరుగుల తేడాతో తాళ్ల పద్మావతి కళాశాల జట్టు గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తాళ్ల పద్మావతికి చెందిన రాజ్‌కుమార్ 39 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.



గెలుపొందిన మాస్టర్ జీ డిగ్రీ అండ్ పీజీ జట్టు



గెలుపొందిన తాళ్ల పద్మావతి ఇంజనీరింగ్ జట్టు





కమలాపూర్‌లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు విచ్చేసిన ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీపీ ఏవీ రంగనాథ్.

సాయిబాబా, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ



హుండీలను పరిశీలిస్తున్న పోలీసులు

భీమదేవరపల్లి: హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, ముల్కనూర్ గ్రామాల్లోని ఆలయాల్లో హుండీలతో పాటు కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీలింగ్ ఫ్యాన్లను దొంగలు అపహరించినట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం తెల్లవారుజామున వరంగల్–సిద్దిపేట రహదారి సమీపంలోని కొత్తపల్లి సాయిబాబా ఆలయ ఆవరణలో ఉన్న పెద్ద నిచ్చెన సాయంతో ఆలయంలోకి చొరబడి నాలుగు హుండీలు, రూ.15వేల విలువ చేసే సాయిబాబా కడియాన్ని అపహరించుకపోయారు. హుండీలను సమీపంలోని మామిడి తోటలోకి తీసుకెళ్లి అక్కడే వాటిని పగలగొట్టి నగదును దోచుకెళ్లారు. అలాగే, కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మన ఊరు–మన బడిలో భాగంగా ఏర్పాటు చేసిన 9 సీలింగ్ ఫ్యాన్లను సైతం దోచుకెళ్లారు. అదేవిధంగా ముల్కనూర్ రేణుక ఎల్లమ్మ ఆలయంలో మూడు హుండీలను ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలాలను పరిశీలించి విచారణ ప్రారంభించారు.

తాళం వేసిఉన్న ఇంట్లో..

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అయోధ్యపురంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై సతీష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గట్టు రమేష్ తన కుమార్తెను సోమవారం వరంగల్‌లోని హాస్టల్‌లో చేర్పించేందుకు వెళ్లాడు. అనంతరం అతడి భార్య ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లింది. ఈ క్రమంలో తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలోని రూ.40వేల నగదు, రూ.60వేల విలువైన బంగారం అపహరించుకుపోయారు. ఈ విషయమై ఇంటి యజమాని గట్టు రమేష్ మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ కాలనీలో ..

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి ఎక్సైజ్ కాలనీలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. దీప–సురేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనక వైపు ఉన్న తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని రూ.30 వేల బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదుత మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

నైబర్‌హుడ్ చాలెంజ్ పోటీల్లో మూడో స్థానం

వరంగల్ అర్బన్: స్మార్ట్‌సిటీ మిషన్‌లో భాగంగా వరంగల్ మహా నగరం నైబర్‌హుడ్ చాలెంజ్ పోటీల్లో దూసుకెళ్తోంది. 2021లో 10వ స్థానంలో ఉన్న వరంగల్ 3వ స్థానానికి ఎగబాకింది. ఈ మేరకు డబ్ల్యూఆర్ఐ ఇండియా సంస్థ ప్రకటించింది. ఈ విషయాన్ని బల్దియా అధికారులు ట్విట్టర్ ద్వారా మంగళవారం పోస్టు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న స్మార్ట్ సిటీ పోటీల్లో కోహిమా నగరం మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో ఇండోర్ స్మార్ట్‌సిటీ, మూడో స్థానంలో వరంగల్ నగరం నిలిచింది. ఆకర్షణీయంగా అంగన్‌వాడీలు, ఆట స్థలాలను మెరుగుపర్చడం, వీధుల్లో, జంక్షన్ల వెంట పచ్చదనం, క్రీడా మైదానాల్లో మౌలిక వసతుల కల్పన, సురక్షిత జీవనానికి కృషి చేస్తున్నట్లుగా ప్రకటించింది.

బీరు సీసాలో తేలు



బీరు సీసాలో కనిపిస్తున్న తేలు

నర్మెట: జనగామ జిల్లా నర్మెట మండల కేంద్రంలోని తిరుమల వైన్స్ నుంచి స్థానిక యువకులు(వజ్జ పరశురాములు, కన్నెబోయిన కరుణాకర్) మంగళవారం సాయంత్రం బీరు కొనుగోలు చేశారు. తాగేందుకు సిద్ధమైన వీరు గ్లాసుల్లో పోయగా.. దుర్వాసన రావడంతో సీసాను పూర్తిస్థాయిలో గమనించారు. దీంతో అందులో నల్లని తేలు కనబడింది. షాపు నిర్వాహకులను నిలదీస్తూ షాపు ఎదుట వాగ్వాదానికి దిగారు.